


“నీరజా! ఓ నీరజా! యింకా రెడీ కాలేదూ! అవతలి సినీమాకి టైము అయిపోతోం దోయ్” ఆఫీసులోనే ఆలశ్యం అయిపోయినా ఫర్లేదులే అనుకుని, వస్తూనే రిక్షా తెచ్చిన మదన్ కి నీరజ మెలా కన్పించిందంటే పనిమనిషి అప్పలమ్మలా వుంది.

వంటగదిలోని ఎక్కడ సామానులు అక్కడ వదిలి, పడక కుర్చీలో పడుకుని పమిట కొంగు ముఖాన కప్పుకుని యేడుస్తోంది.



# వివాహ బంధం

—గోవిందరాజు సీతాదేవి

కళ్లు ఎర్రగా వున్నాయి. ముఖం జిడ్డోడుతోంది. చేతిలో ఆ రోజే వచ్చిన వుత్తరం కాబోలు నలిగి, వుండ చుట్టుకుపోయి వుంది.

ఇదంతా చూసిన మదన్‌కి హుషారంతా చప్పబడిపోయింది. ఆ పైన వళ్లు మండుకొచ్చింది. చరచరా వీధిలోకి వెళ్ళి, రిక్షా వాడికి డబ్బిచ్చి, పొమ్మని లోపలికి వచ్చేశాడు. మదన్ నీరజల పెళ్ళి అయి మూడునెలలన్నా కాలేదు. కాని అప్పుడప్పుడూ ఇలా ఏడ్చే నీరజని చూడటం అతనికి అలవాటు అయిపోయింది. అసలు వీరి వివాహం పెద్దలు చేసింది కాదు. కాలేజీలో మూడేళ్ళు ప్రేమించుకుని, మూడు వందల ప్రేమ లేఖలు రాసుకుని ఇద్దరి తల్లిదండ్రులూ కులాంతర వివాహానికి అనుమతించకున్నా "మా పెళ్ళి మా యిష్టం" అని ఆ వూరు వదిలి ఈ వూరు వచ్చి, గుళ్లో పెళ్ళి చేసుకున్న మదన్‌కి

అదృష్టంవల్ల ఆ నెల్లోనే వుద్యోగం వచ్చింది. స్నేహితులు నీరజ అదృష్టవంతురాలు అని పొగిడి, పార్టీ చేయించేసుకున్నారు.

"ఈయువతరానికే ప్రతినిధివోయ్ మదన్! నయాపైసా కట్నం లేకుండా ఓ కన్నె పిల్ల చెర వదిలించావు. ఆదర్శం అంటే నీదే" అని పొగిడేశారు స్నేహితులు. నిజంగా ఆ సమయంలో గర్వంగా, తృప్తిగా వుంది మదన్ కి. కాపురం పెట్టిన కొత్తలో, జీతం రాగానే సినీమాలూ,షికార్లూ,హోటల్లోనే భోజనాలూ- అబ్బ కలలా జరిగిపోయింది కాలం. కానీ ఇప్పుడిప్పుడు నీరజతో చిన్న చిన్న స్పర్ధలు వస్తూన్నాయి. అవే పెరిగి పెద్దవీ అవుతూన్నాయి. అలా జరగకుండా వుండాలని తను ప్రయత్నిస్తూన్నాడు. కానీ నీరజకి బొత్తిగా బుద్ధి లేదు. వాళ్ళ తల్లి దండ్రులూ అక్కచెల్లెళ్ళు దూరమైనారని విచారమే కానీ మదన్ కూడా తన తల్లి తండ్రులకు దూరమైనాడని కాస్త కూడా ఆలోచించదు.

పైగా మదన్ ఆకలికి ఆగలేడు. అలా అని భార్యని వదిలి కడుపు నింపుకునే కసాయి వాడూ కాదు. అందుకే "నీకెంత కోపం వున్నా, బాధ వున్నా అన్నం మానేయకు. నేనసలు ఆకలికి ఆగలేను. అలా అని నిన్ను వదిలి తినలేను" అని చాలాసార్లు చెప్పాడు. అప్పుడు "సరే" అని గొర్రె పొటేల్లా తల వూగించేస్తుంది నీరజ. కానీ సమయం వస్తే మామూలే.

"అలా కోపం తెచ్చుకోకు. నా క్కోపం వస్తుంది" శాంతంగా ఎన్నోసార్లు చెప్పాడు మదన్.

"అది నా స్వభావం. చచ్చినా పోదు" పెంకెగా అంటుంది నీరజ.

"అంత కోపం ఆడపిల్లకి తగదు" అంటే చాలు, నీరజకి కోపం మళ్ళీ ముందుకు వచ్చేస్తుంది.

"అబ్బబ్బా దీనికి ఇంకా ఎలా చెప్పటం భగవంతుడా" అనుకుని జుట్టు పీక్కుని ఆ రాత్రి అంతా నిద్ర పోకుండా సిగరెట్లు, కాల్చేస్తూన్నా, యిదేం తనకి పట్టనట్లు హాయిగా నిద్ర పోయే నీరజని చూస్తూ పళ్లు కొరుక్కుంటాడు. కానీ ప్రయోజనం ఏమిటి! మదన్ అశాంతితో వేగి తెల్లవారేసరికి దేవదాసుపోజులో తయారవుతాడు. నీరజ మాత్రం హాయిగా ఆరింటికి లేచి, ఫిల్టర్ డికాషన్ లోని చిక్కని కాఫీ ముందు తను తాగేసి, భర్తకి లైట్ కాఫీ కల్పి వంట యింట్లో నించే గావుకేక పెడుతుంది.

"ఇంకా లేవలేదూ! ఇవాళ ఆదివారం కాదని తెలియదూ." అని, రాత్రంతా నిద్రలేక కళ్లుమండి తెల్లవారురూముకి కాస్త కునుకు పట్టిన మదన్‌ని అప్పుడే లేపకూడదన్న జ్ఞానంకూడా ఆ అమ్మాయికి వుండదు. వున్నా పాటించదు.

* *

ఒకసారి మార్కెట్‌లో సర్వారావు (మదన్ ఆఫీసులోనే పనిచేసే వుద్యోగి) కన్పించి మాటల్లోకి దించి నిలబెట్టేశాడు.

"మదన్‌మోహన్‌గారూ! మీకూ మాకులాంటి అవస్థలేవున్నాయా!" అన్నాడు. "అంటే?" మదన్ చేతిలోని సంచీ సైకిల్ వెనుక కాయితంలో కట్టిన కొంచ చీపురూ వగైరా పరీక్షగా చూస్తూ తన చేతిలోని సంచీని, క్రింద పెట్టి నిలబడి మరీ అన్నాడు. "మరేం లేదు. యీ కూరలూ గట్రా అవుసరం వుందా అని"

"ఓహ్" అని తేలిగ్గా నవ్వేసి, సర్వారావు వైపు జాలిగా చూసి "పాపం" అనుకున్నాడు. సర్వారావుకి పాపం పదేళ్ళప్పుడే యెనిమిదేళ్ళ మేనమామ కూతురు మహాంకాళితో పెళ్ళి జరిగిపోయిందిట. "అసలాపెళ్ళి నాకు గుర్తేలేదు మదన్‌గారూ! బుద్ధితెల్సిన దగ్గర నుంచీ మాంకాళీ మా ఆవిడ అని మాత్రమే తెల్సు." అని పేలవంగా నవ్వేస్తూ వుంటే అతన్ని చూసిన యెవరికైనా సరే జాలి ముంచుకు వస్తుంది.

మదన్ మాసిన గడ్డాన్ని యెడం చేత్తో తడుముకుని, "సర్వారావుగారూ, ప్రేమ వివాహం అయినా కాకున్నా ఆ తర్వాత జీవితాలు అందరివీ ఒక్క లాగే వుంటాయి కదండి" అన్నాడు.

"నే ఛస్తే వప్పుకోను. పెద్దలు చేసిన పెళ్ళి అసలు పెళ్ళేకాదు అంటాను. జీవితంలో పెళ్ళి అనేది అతిముఖ్యమైన మలుపు. అన్నిటికంటే విలువైందీ, ప్రధాన మైందీ కూడా. అలాంటిపెళ్ళి వారి వారి ఇష్ట ప్రకారం జరిగితీరాలి. కానీ పెద్దలు పెత్తనం చేసి అదిగో అదే నీ పెళ్ళాం. దానితో జీవితాంతం కల్పి చావు అనటమంత రాక్షసత్వం మరోటి వుండదంటాను. మీరు కాదంటారా!"

మదన్ దీనికి జవాబు చెప్పాలనుకున్నాడు. కానీ, వాచీ చూసుకునే సరికి అప్పటికే తొమ్మిది కావొస్తోంది. లాభంలేదు. ఆఫీసుకి ఆలశ్యం అయిపోతుంది అని, మళ్ళీ కలుద్దాం అని సైకి లెక్కేశాడు.

సైకిల్‌దిగి సంచీ తీసుకుని

లోపలికి వస్తూంటే నీరజ అపర కాళిలా నడుంమీద చేతులు పెట్టు కుని నిలబడి—

"గడియారంలోకి ఒకసారి చూడు" అంది. మదన్ నిర్లక్ష్యంగా సంచీ అందించాడు.

"ఏం! మార్కెట్‌లో సర్వా రావుగానీ కన్పించాడా!" అంది కోపంగా.

"ఏం యెందుకూ!"

"నిటారుగా నడిచి వస్తూం టేనూ!" అని వ్యంగ్యంగా నవ్వి "తొమ్మిదింటికి కూరలు తెచ్చి నా ముఖాన తగలేసి అర్ధగంటలో అన్నంపెట్టు అంటే నేనేం సతీ అనసూయనా, ముదురు బెండకా యల్ని క్షణంలో వుడికించెయ్య టానికి" అంటూ తగూకి దిగింది.

మదన్‌కి కోపంవస్తూన్నా తమా యించుకూంటూ గడ్డం చేసుకోవ టానికి అద్దం, సోపు వగైరా తీసు కుంటూ-

"సతీ అనసూయ కాకున్నా హైందవ గృహిణివి కావూ! గాస్ పొయ్యిమీద అర్ధగంటలో వంట చెయ్యలేవూ యిద్దరికీ." అనేసరికి

"-నేను ముందు గృహిణిని కాను. ప్రియురాలినేగా, కనుక పోదాం పదండి హోటల్‌కి యీ పూటకి. రాత్రికి తీరిగ్గా వేయిస్తాను బెండకాయ వేపుడు" సాగదీస్తూ అంది.

"అహాహా! ఎంత తియ్యగా మాట్లాడినా, ఆ మూడు ముళ్ళూ పడక ముందైతే నాలాంటి ప్రతి వెధవా జేబుఖాళీ అయినా,వడ్డీకైనా డబ్బుతెచ్చి నిన్ను ఆటోలో హోట ల్‌కి తీసుకు వెడతాడు. కానీ నీ విప్పుడు సాక్షాత్తూ నా అర్ధాంగివి. అర్ధగంటలో పప్పు కూరా, పులుసు, పచ్చడీ రెడీ చెయ్యకపోయావా..." అని క్షణం ఆగాడు.

"ఆగిపోయారేం చెప్పండి" అని రెట్టించటంతో "నే వేసిన మూడు ముళ్ళకి అర్ధం వుండదు" అనే శాడు, నీరజకి కోపం వచ్చేసింది. కడవంత గుమ్మడికాయా కత్తిపీటకి లోకువ అన్నట్లు నేనెంత చదూవూ సంస్కారం సంపాదించుకున్నా యీాయన దృష్టిలో వంటకి పనికి వచ్చే మనిషినేనా అని ఆవేశపడి పోయి—

"మూడు ముళ్ళకీ బదులు మరోమూడు ముళ్ళు వేసేయండి ఈ తాడుతోనే. యింకే "వురి!" అక్కరలేకుండా చచ్చి వూరుకుం టాను. పావు గంటలో పదిరకాల పదార్థాలు వండి వడ్డించాలట! వెధవ తిండిపోతు గుణం, బాపన య్యలికి పుట్టుకతోనే వస్తూంది

అని మాఅమ్మమ్మ ఎప్పుడూ అన్నా నేన్నమ్మలా." అంటూన్న నీరజ చెంప ఛెళ్ మంది. మదన్‌కి తన కులం పేరు ఎత్తి ఏ మాట అన్నా అసలు సహించలేడు.

"నీ కొమటిబుద్ధి నాకు చస్తే రాదు. ఛఛ! బుద్ధితక్కువై చేసుకున్నాను"

మదన్ గడ్డం చేసుకోకుండానే స్నానంచేసి ఆకలితోనే ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

ఆఫీసులో కొత్తగా ట్రాన్స్ఫర్ అయివచ్చిన రాజేశ్వర్రావుని టైపిస్టు మూర్తి మదన్‌కి పరిచయం చేశాడు. రాజేశ్వర్రావు చిరునవ్వుతో చెయ్యి అందించాడు. చాలా హుషారుగా కబుర్లు చెప్పాడు. తను ఫామిలీతోనే వచ్చేసి, యెక్కడ ఇల్లు తీసుకున్నదీ కూడా చెప్పాడు. "ఓ అమ్మాయి, ఓ అబ్బాయి బస్ చాలు గదూ!" అన్నాడు నవ్వుతూ.

మదన్ కడుపులో ఆకలి కరకర మంటూన్నా కాంటీన్‌లో టిఫెన్ తినబుద్ధికావటం లేదు. మాటి మాటికీ నీరజ అన్నమాటలే గుర్తుకి వచ్చి, మనస్సు బాధపడిపోతోంది. ఆ విషయాన్నుంచి మనస్సు మళ్ళించుకోవాలని ప్రయత్నిస్తూన్నాడే కానీ చేతకావటం లేదు. రాజేశ్వర్రావుతో సర్వారావు కబుర్లుచెపుతూ"చూడండీ మీకులానే యీ మదన్‌ది "లవ్"మారేజ్. అదీ కాక వర్ణాంతర వివాహం కూడానూ. వీళ్ళ దాంపత్యం చూడముచ్చటగా వుంటుంది. అచ్చంగా చిలుకా గోరింకల్లా వుంటారనుకోండి." అనటం తడవుగా, రాజేశ్వర్రావు మదన్ దగ్గరకొచ్చి ఆత్మీయంగా చెయ్యి పట్టుకుని నొక్కి "చాలా సంతోషం. అన్నట్లు మీ ఇల్లు యెక్కడ" అంటూ అతి చనువుగా మాట్లాడి "ఓ సారి మా ఇంటికి రండి మీరిద్దరూ"అని ఆహ్వానించాడు. మదన్ మనస్సు తేలికగా అయినట్లుంది.

"కాదు, మీరే మాయింటికి సన్‌డే తప్పక టీకి రావాలి" అని మరీమరీ చెప్పి యింక ఆఫీసు పనిలో మునిగిపోయాడు.

ఆ రాత్రి ఇంటికి వచ్చేసరికి నీరజ పీక్కుపోయిన ముఖంతో వున్నా, వంట రెడీచేసి "భోజనానికి రండి" అనటంతో అద్దంమీద ఆవ గింజలా ఆ తగూ తీరిపోయింది.

రాజేశ్వర్రావు యిచ్చిన మాట ప్రకారం మదన్ ఇంటికి ఆదివారం సాయంకాలం అయిదింటికి పిల్లలతోసహా ఆటోలో వచ్చేశాడు. నీరజా మదన్‌లు ఆత్మీయంగా ఆహ్వానించారు. శాంతకూడా చాలా

నెమ్మదస్తురాలిలా కన్పించింది. మాట కూడా తీరుగావుంది. అందం అంతగా లేకున్నా అణుకువ యెక్కువ కన్పిస్తోంది ఆమెలో అనుకుంది నీరజ. నిజం చెప్పా లంటే రాజేశ్వర్రావే చాలా బాగున్నాడు. అయినా శాంతగార్ని ఎలా ప్రేమించి పెళ్ళి చేసు కున్నారో! లోలోపల ఆశ్చర్య పోయాడు మదన్. రాజేశ్వర్రావు తన ప్రపంచం ఆఫీసూ, తర్వాత ఇల్లూ, భార్యా పిల్లలూ యింతే, అప్పుడప్పుడూ సినిమాలూ అంటూ నవ్వేశాడు. శాంత మితభాషి. అయినా నీరజకి బాగా నచ్చింది.

ఇంక తమ తమ ప్రేమ వ్యవహారాలూ, తర్వాత పెళ్ళి-అంతా కబుర్లు చెప్పుకుని రెండు గంటలు కాలక్షేపం చేశారు. వాళ్ళు వెళ్లినతర్వాత నీరజ అంది మదన్‌తో—

"శాంత క్రిష్టియన్‌ట. అతను రెడ్డి కులంట. అబ్బ వీళ్ళద్దరికీ ఒక్క ఇంట్లో యెలా పొసుగుతున్నదో!" అంది.

"మనస్సులు కల్సిన తర్వాత ఆచారవ్యవహారాలకీ, అలవాట్లకీ ప్రాముఖ్యత యివ్వకూడదు. అప్పుడు సంసారం స్వర్గం అవక ఏం చేస్తుంది!"

"అంటే మీ వుద్దేశం?" చికా కుని అణుచుకుంటూ అంది.

"ఏం లేదు." అని అప్పటికి ఆ విషయం తప్పించే సరికి మదన్‌కి తలప్రాణం తోకకి వచ్చింది.

"అమ్మయ్య" యివాళకి ఫర్లేదు అనుకున్నాడు. నీరజ నవ్వు ముఖంతో పడక గదిలోకి రావటం గమనించిన మదన్.

మదన్ దూరపు బంధువు ఏదో పనిమీద ఆవూరువచ్చి మదన్‌ని కల్సుకుని వాళ్ళ ఇంటి విషయా లన్నీ చెప్తూ "నీ విలా పెళ్ళి చేసు కున్నావు గానీ తర్వాత నీ చెల్లెలికి ఒక్క సంబధమూ కుదరటంలేదు. ఓ రెండు సంబంధాలు కుదిరినట్లు కుదిరి—

"మాకువద్దు" అని కబురు చేయటంతో మీ అమ్మా నాన్నా యింక దిగులుపడిమంచం పట్టారు. ఆ మధ్య మీ అమ్మకి టైఫాయిడ్ వచ్చి చచ్చి బ్రతికినంత పని అయింది మీ అన్నలు అస్సలు సంసారం విషయాలు పట్టించుకో వటం లేదని మీ నాన్న దిగులు. అన్నట్లు మీ తాతగార్కి పక్షవాతం వచ్చి కాలూ చెయ్యి పడిపోయింది. నీకా విషయం కూడా తెలియదూ? మదన్! మీ ఇంట్లో అందరి విష యం అలావుంచు కానీ, మీ అమ్మ బాధ మాత్రం చూడలేక పోతూ

న్నాం. మీ నాన్న ఛండశాసనుడనే భయంతో తన దుఃఖాన్ని ఆ మహా ఇల్లాలు దిగమింగేసుకుంటూ వుంది. ఆవిడకి నువ్వంటే నాలుగో ప్రాణం అన్నది నీకు తెలియదూ! ఏమిటో ఈ కాలం పిల్లలు. ప్రేమా పెళ్లీ అంటూ ! కన్న తల్లి దండ్రులనీ, తోడబుట్టిన అన్నదమ్ములనీ, అక్కచెల్లెళ్ళనీ దూరం చేసుకుని మీరు మాత్రం పెళ్ళిచేసుకుని సుఖాన్ని రెండు చేతులా జుర్రేసు కుంటూ న్నారేమో నా కైతే తెలియదుకానీ ఓ సారివెళ్ళి మీ అమ్మని చూసి చక్కా రాబాబూ" అంటూ చెప్పి పోయాడు.

మదన్‌కి దుఃఖం కట్టలు తెంచుకు వస్తోంది. తన తల్లి దండ్రులూ, అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ ఒక్కరొక్కరుగా గుర్తు కొస్తున్నారు. అందరికంటే ముందు వ్యథ పడిపోతున్న తల్లి కళ్ళకి కన్పిస్తున్నట్లు వుంది. మనస్సు పిండేస్తున్నంత బాధ. తన చిన్నప్పటినుంచీ జరిగిన ఎన్నో సంఘటనలు- తన భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడినశ్రమ కన్న కలలూ గుర్తుకొస్తున్నాయి. తల గట్టిగా పట్టుకుని పార్కులోవెళ్ళి కూర్చుండి పోయాడు.

'అమ్మా! అమ్మా! నాసుఖం కోసం నీకెంతబాధ కలిగించానమ్మా' లోలోపలవ్యథపడిపోయాడు. రాత్రి తొమ్మిది గంటలు దాటుతోంది. తన కోసం ఎదురు చూసే నీరజ గుర్తుకి వచ్చింది. అయినా ఇంటికి వెళ్ళ బుద్ధి కావటంలేదు. పదీ పదకొండు గంటలకు పార్కు గేట్లు మూసేస్తూంటే ఆఖరికి లేచి ఇల్లు చేరాడు. నీరజ బట్టలన్నీ పెట్టెలో సర్దుకుని ఆ రోజు ఓ స్నేహితురాలు రాసిన వుత్తరం విషయం చెప్పి "ఏమండీ మా అన్నయ్యపెళ్ళి కుదిరిందిట. నే తప్పక వెళ్ళితీరాలి. రైలుకి టికెట్ రిజర్వేషన్ చేయించేయండి" అంది మదన్ వైపు చూడకుండానే వంటగదిలో కెళ్ళి యిద్దరికీ వడ్డించేస్తూ. మదన్ మౌనంగా పడక కుర్చీలో వాలిపోయాడు.

"అన్నట్లు యింత సేపు రాలేదు ఎక్కడున్నట్లూ?"

"అబ్బ ఆకలిగా వుంది త్వరగా రావాలి" తనకి తినాలని లేకున్నా నీరజ కోసం లేచి వెళ్ళాడు చేతులు కడుక్కుని.

"ఏం రైలుకి రిజర్వేషన్ చేయిస్తారుకదూ!"

"మీవాళ్ళెవరూ కనీసం ఉత్తరమైనా రాయలేదే?"

"మరేంఫర్లేదు. నే వెళ్ళితీరాలి

"అవమానం చేస్తే?"

"నన్నా? నావాళ్ళా! అవమానం చేస్తారా! చస్తే చెయ్యరు అన్న నమ్మకం నా కుంది"

"నాకు లేదు"

"మావాళ్ళగురించి మీకేంతెల్సు"

"తెలియక్కరలేదు కానీ వాళ్ళ దగ్గరనుంచి వుత్తరం రాకుంటే నువ్వు వెళ్ళటానికి వీల్లేదు."

"ఏమిటీ!" కోపంతో చూసింది నీరజ

"ఔను. అదంతే. నువ్వు వెళ్ళటానికి వీల్లేదు"

"ఏం యెందుకు వీల్లేదు"

"అదంతే" విసురుగా చెయ్యి కడిగేసి లేచేశాడు.

"ఎందుకూ అంటున్నాను" తనూ చెయ్యికడిగి వచ్చేసి అంది.

"మన ప్రేమ వివాహంతో యిటు నా వాళ్ళనీ వదిలేశాను. అటు నీ వాళ్ళనీ వదిలెయ్యి. వాళ్ళు మనని గౌరవించలేదు. కనుకనే వాళ్ళింటికి వెళ్ళే ప్రసక్తి లేదు."

"మీ వాళ్ళని మీరు వదులు కున్నా నా వాళ్ళని వదులుకోను "

"నీరజా! యిదుగో! చెప్తున్నాను. నా మాట అంటే గౌరవం లేకుండా వెళ్ళావో మళ్ళీ ఈ. గడప తొక్కాల్సిన పనిలేదు. తెల్సా!" అంతే ఇంక మాట్లాడలేదు తెల్లవారి ఆఫీసుకి వచ్చాడే కానీ అతని ముఖం నల్లగా మాడి పోయేవుంది. మౌనంగా తను పని చేసుకుంటూ వుంటే రాజేశ్వర్రావు దగ్గరగా వచ్చి అడిగాడు.

"మదన్ ఏం వంట్లో బాగా లేదా?" అని

"ఏం లేదు, బాగానే వున్నానే" అన్నాడు తలెత్తి చూస్తూ. రాజేశ్వర్రావు మదన్ ముఖంలోకి తదేకంగా చూసి "అన్నట్టు నీరజ రైల్వేస్టేషన్‌కి వచ్చిందని మా శాంత చెప్పింది. ఎక్కడికి వెడుతూన్నదీ?"

"తెలియదు"

"తెలియదా!"అనిరాజేశ్వర్రావు "కాఫీ తాగివద్దాంరా" అని మదన్‌ని అక్కడినుంచి లాక్కుపోయి, శలవు చీటీలు పెట్టి, తన ఇంటికి తీసుకువెళ్ళి కాఫీ తెప్పించి యిచ్చి, "ఏమైంది" అన్నాడు, యెంతో ఆత్మీయంగా. అప్పటికే ఇద్దరికీ చాలా చనువు యేర్పడటంతో, మదన్ అంతా చెప్పేశాడు. నీరజ పెంకెతనం అదీ తనకి విసుగు కల్గిస్తూన్నదనీ, తన తల్లి గుర్తుకి వచ్చి బాధగా వుందనీ.

రాజేశ్వర్రావు అంతా శ్రద్ధగా విని సోఫాలో వెనక్కి వాలి కూర్చుని సిగెరెట్ అంటించాడు.

మదన్ భుజం మీద చెయ్యివేసి ప్రేమగా దగ్గరకి తీసుకుని.

"మదన్! వివాహబంధం అతి పవిత్రమైంది. అది ప్రేమతో ప్రారంభమైనా, పెద్దలు యేర్పరచిన దైనా ఒక్కటే. దీనికి కులం, మతం అడ్డురాకూడదు. స్త్రీ పురుషుల మనస్సులు ఏకమై, ఒకర్ని ఒకరు అర్థం చేసుకుని ఒకరికోసం ఒకరు బ్రతికే పవిత్రబంధం.

"ఈ కులమతాలకి అతీతమైన మనస్సులున్నప్పుడే వర్ణాంతర వివాహాలు సఫలమవుతాయి. మీ రిద్దరూ తెల్సిగానీ, తెలియకగానీ వర్ణాంతర వివాహాలు చేసేసు కున్నారు. యిప్పుడింక ఒకరికి అనుగుణంగా మరొకరు మారి పోతూ, ప్రశాంతంగా సంసారాన్ని నడుపుకోవాలి కానీ, యిలా ప్రతి విషయానికీ కీచులాడుకుంటే యెన్నాళ్ళు సాగించగలరు? అలా అని విడిపోయారే అనుకోండి. నలుగురిలో యెంత అవహేళనకి గురి అవుతారో ఆలోచించారా! పెద్దలు చేసిన పెళ్ళిళ్ళకు సామాన్యంగా యిద్దరి వైపునా అండ దండలు వుంటాయి. కానీ యీ ప్రేమ పెళ్ళిళ్ళకి అవి సామాన్యంగా లభించవు. కనుకనే భార్యాభర్త లిద్దరూ మరీ సన్నిహితంగా మెలగ వల్సిన అవసరం చాలా వుంటుంది.

"మా పెళ్లి విషయమే చెప్తాను. నా కెన్నో దురభ్యాసాలున్నా. వివాహం అయిన తర్వాత శాంత ప్రేమాభిమానాలకి తలవంచి ఆ అలవాట్లని తగ్గించుకోవటానికి ప్రయత్నిస్తూన్నాను.

"శాంత నన్ను శాసించదు. ఒకటికి రెండుసార్లు చెప్తుంది. అంతే. యింక ఆ విషయంలో మంచి చెడ్డలని ఆలోచించుకో వల్సింది నేనే."

మదన్ మిత్రుడి మాటలు శ్రద్ధగా వింటూనే "మీ శాంతా దేవిలో వున్నంత శాంతం మా నీరజలో లేదండీ" అన్నాడు ఆవే శంగా. రాజేశ్వర్రావు నవ్వేశాడు.

"చూడు మదన్. సౌమ్యంగా మాట్లాడటం చేతకానంత మాత్రాన మీ నీరజ మనస్సు మంచిది కాదని అంటావా!

"........"

"అలా అయితే కాలేజీలో మూడేళ్ళు కల్సిచదివి, సినిమాలకీ, షికార్లకీ తిరిగినప్పుడు కన్పించని కాఠిన్యం నీ కిప్పుడు భార్య కావటం వల్ల కన్పిస్తోంది కదూ!"

"........"

"మదన్! నీవంటే నీరజకూ,

నీరజంటే నీకూ 'ప్రేమ' లేదు అని అనుకోకు. యిటు నీ వాళ్ళు దూరమైనారని నీకు బాధ. ఆమె వాళ్ళకి దూరమైందని ఆమె బాధ. అయితే యీ పరిణామాలన్నీ యిలా వస్తాయని ఆలోచించ వల్సిన టైము అయిపోయింది గనుక ప్రస్తుత విషయం మాత్రమే కావాలి కదూ!" అని సిగెరెట్ దమ్ము లాగి మళ్లీ అన్నాడు.

"మదన్, నేనో సలహాచెప్తాను. శ్రద్ధగా విను. ఒకరి లోపాలని ఒకరు క్షమించలేని వాళ్లు స్నేహితులుగానే యెక్కువ కాలం వుండ లేరే, అలాంటప్పుడు జీవితాంతం కల్సి బ్రతకవల్సిన భార్యాభర్తలు ఒకరిని ఒకరు విమర్శించుకుంటూ వుంటే యెలా! నీరజ విషయం అలావుంచి నీ మటుకు నువ్వు ఆమె అభిప్రాయాలతో కల్సిపోవటానికి ప్రయత్నించు. మంచిది కాని విషయాలను వివరించి చెప్పు. శాంతంగా, క్రమంగా ఆమె నీ అభిప్రాయాలని అర్థం చేసుకు తీరుతుంది. సరే యీ విషయాలన్నీ... ముందు నీరజని ఆమె యిష్టప్రకారమే పుట్టినింటికి పంపు. ఒంటరిగా కాదు సుమా, జంటగానే వెళ్ళండి. యిదే నా సలహా"

"అక్కడ మాకు ఎలాంటి సత్కారం జరుగుతుందో నాకు తెల్సు. కనుక నే వెళ్ళను" ఖచ్చితంగా అన్నాడు మదన్

"పిచ్చి మదన్! నీకు ఆవేశమే తప్ప ఆలోచన లేదు. చూడు, అలనాడు పురాణాల్లో దక్షయజ్ఞానికి వెళ్లిన పార్వతిలా అయితే నీరజ నిన్ను వెతుక్కుంటూ పరుగెత్తుకు వస్తుంది. లేక వాళ్లు గౌరవంగా అదరిస్తే.... నీవు అల్లుడివిగా అలక పాన్పు యెక్కవచ్చు" అంటూ మదన్ చెవులో రహస్యంగా యేదో చెప్పి, వప్పించాడు రాజేశ్వర్రావు. మదన్ ముఖంలోని అశాంతి అంతా క్రమంగా పోయి మెల్లగా యిల్లు చేరిన మదన్‌కి యింటికి పెద్ద తాళం కప్ప వ్రేలాడుతూండేసరికి గాభరా పుట్టింది. మదన్‌ని చూసి ప్రక్కింటి పంకజాక్షి తాళం చెవి అందించి వెళ్లిపోయింది.

'భగవాన్' అనుకుని అటునించి అటే రైల్వేస్టేషన్‌కి పరుగు తీశాడు మదన్. టికెట్ తీసుకుని ప్లాట్‌ఫారం మీదకి పరుగుతీసేసరికి రైలు కూత వేసి బయలుదేరటం కన్పించి, యెలాగో ఆఖరు పెట్టె అందుకుని 'అమ్మయ్య' అనుకుని' వళ్ళంతా పట్టిన చెమట తుడుచుకుని, మెల్లగా ఒక్కొక్క పెట్టెను చూస్తూ

ఆడవాళ్ళ పెట్టెలో కూర్చుని, సూట్ కేస్ ప్రక్కన పెట్టుకుని యెర్రగా వున్న కళ్లని కర్చీఫ్‌తో వత్తుకుంటూన్న నీరజ కన్పించిం తర్వాత 'అమ్మయ్య' అనుకున్నాడు మదన్.

నీరజ రైలుదిగి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. పెళ్లిల్లు అంత వరకూ రణగొణధ్వనిగా వున్నా క్షణంలో నిశ్శబ్దమై పోయింది. ఇంతలో అరుపులూ, కేకలూ, తిట్లూ ఓపనలూ, యేడుపులూ కల గాపుల వినిపిస్తూన్నాయి. ఒక అర్ధగంటలోనే నీరజ పెట్టెతీసుకుని ఆ ఇల్లు వదిలి బైటకి వచ్చేసింది. పొంగి పొర్లి వచ్చే దుఃఖాన్ని దిగమింగుకుని నీరజ శోకదేవతలా వుంది. రైల్వేస్టేషను వైపుగా కాక కాలువ దారిపట్టిన నీరజ భుజాలమీద చేత్తో గట్టిగా నొక్కి పట్టుకున్న ఆ చేతిని విసురుగా లాగేస్తూ, "ఎవరు నువ్వు" అంది వెనక్కి తిరిగి చూస్తూ. చిరునవ్వుతో నిల్చున్న మదన్‌ని ఆశ్చర్యంగా చూస్తూ....

"మీరు....మీరు....యిక్కడికెలా వచ్చారు. ఎందుకొచ్చారు? ఎవరి కోసం వచ్చారు?"

"నీకోసం, నా భార్య కోసం, నా నీరజకోసం.వచ్చాను! కానీ. .. నీరజా! చదువుకున్న నీలాంటి ఆడపిల్ల తల్లిదండ్రులు అగౌరవ పర్చారని యిలాంటి కాలువలదగ్గరకా పరుగెత్తుకు వచ్చేది. ఛీ.ఛీ...." అంటూ దగ్గరకి తీసుకుంటూంటే నీరజ రోషంగా చూస్తూ—

"ఏం. చేయను. భర్తకి అక్కర లేదు. తల్లిదండ్రులకీ అక్కరలేని నేనేం చేయాలి?...." భోరుమంది నీరజ.

"పిచ్చి. నీ తల్లితండ్రులకి అక్కరలేకున్నా నాకు నువ్వు కావాలి. నీకు నేను కావాలి. యిది నిజం నీరజా! యింతకి మించి యేం చెప్పలేను." మదన్ కళ్లలో నీళ్లు తిరిగాయి.

"నిజంగా మీరే మాట్లాడుతూన్నారా యివన్నీ"

"ఆశ్చర్యంగా వుందా నీరజా? నీకు నేనూ, నాకు నువ్వుగా బ్రతుకుదాం. యెప్పటికైనా మనిద్దరం కావాలనుకుని వాళ్ళు దగ్గరకొస్తే కాదనంగా" అంటూ ఆమె చేతిలోని పెట్టె తీసుకుంటూన్న మదన్‌ని "ఏమండీ" అంటూ యేదో యేదో చెప్పాలని దుఃఖంలో గొంతు పెగలక, ఒక్క మాటా చెప్పలేక అతని భుజంమీద వాలిపోయిన నీరజని ప్రేమగాచెయ్యి ఆసరా యిచ్చి నడిపించాడు.